# జయలక్ష్మి అపజయం

ఉమాదేవి

ట్రాన్స్ఫరార్డరు అందుకోగానే రిలీవయి సరాసరి ఆ ఊరెళ్ళాడు సూర్యనారాయణ. అంత పల్లెటూరూ కాని, బస్తీకాని ఆ ఊళ్ళో యిల్లు సులభంగానే దొరికింది అతనికి. ఇంతకు ముందు తను రాబోయేస్థానంలోని క్లర్కు ఖాళీ చేయబోతున్న వాటానే తనకూ మాట్లాడుకుని కుటుంబాన్ని తీసుకురావటానికి గుంటూరు తిరిగివచ్చాడు సూర్యనారాయణ. జయలక్ష్మి అప్పటికి నాలుగు సామానులూ సర్దేసి ఉంచటాన చదువుకున్న అమ్మాయిని చేసుకుంటే యింత సుఖం ఉంది కాబోలని లోలోపల ఆనందిస్తూ నలుగురికీ వీడ్కోలు చెప్పి యిక్కడికి వచ్చేశాడు భార్యా సమేతుడయి.

కొత్త యింట్లో సామాను సర్దుకున్నంత సేపూ జయలక్ష్మికి ఒకటే జిజ్ఞాస-పక్కవాటాలో ఎవరూ లేరా? అని. గుంటూరులో అడిగినప్పుడు ఆయన యింటివారు పక్కవాటాలో ఉంటారని చెప్పారు కదా-యిప్పుడు ఎవరూ కనిపించరేమో అనుకుంది. ఏపాటి క్యూరియాసిటీ లేకపోయినా కనీసం యింటివారి హోదాలో నయినా "ఏవమ్మా-ఎలావచ్చారు? నాలుగు సామానులూ చేరాయా? కొత్త చోటు కామోసు-ఏమయినా కావాలా మీకు? పోనీ సామాను లేవయినా కావలిస్తే అడగండి-మొహమాటపడి యిబ్బంది మటుకు పడకండి" అంటూ వచ్చి పలకరించటం జరుగుతుంది అని ఎదురు చూచింది. అదేమో పాకీదొడ్డి దగ్గరనుంచి మంచినీళ్ళబావిదాకా యింటాయన శర్మగారేవచ్చి ఆయనకు చూపించి వెళ్ళారు. కర్మ! ఆడవాళ్ళు లేరు కాబోలు యీ కొంపలో! అని విసుక్కుంది! "పుట్టింటికి వెళ్ళారేమో ఒకవేళ" అని మళ్ళీ సరిపెట్టుకుంది.

ఆ యిల్లు రెండు వాటాలుగా ఉన్నా పూర్తిగా వేరువేరు యిళ్ళులాగే ఉంటుంది. ఎందుకంటే దొడ్లో మధ్య సరిహద్దు గోడ కట్టేశారు. ఇక మరుగులేని దల్లా వాకిట్లోనే వీరి. గడపలో కూర్చుంటే వారి గడప కనిపిస్తుంది. ఈ నాలుగు రోజుల్లోనూ జయలక్ష్మికి యింటామె దర్శనంకాలేదు. అ ఊళ్ళో పనివాళ్ళు దొరక్కపోవటాన పాచిపనితో సహా ఎవరి యింట్లో పని వాళ్లు చేసుకోవలసిందే! జయలక్ష్మికి యిది కొంచెం బాధాకరంగానే ఉంది. "స్కూల్‌ఫైనల్ దాకా చదువుకుని గ్రాడ్యుఏటు భార్యవయిన నీవు అంట్లు తోముకోవలసి వచ్చిందా చిట్టితల్లీ!" అని సానుభూతి చూపేవారే కరువయి పోయారు. మనసులోని బాధను పైకి వెళ్ళగక్కుకుందామా అంటే యిరుగుపొరుగు కూడా ఎవరూ కనిపించక పోయేసరికి మరింత పిచ్చెత్తి పోయినట్లయింది జయలక్ష్మికి.

"పాపిష్టి ఊర్లో వచ్చిపడ్డామే" అని ఆ ఊరిని ఎన్ని సార్లయినా తిట్టుకుంది. కనీసం నలుగులు ఆడంగులు కనిపించినా అంతబాధ అనిపించేది కాదేమో! ఆఫీసుకు దగ్గరని విసిరేసినట్లు ఊరి చివర యిల్లు తీసుకున్నారు. ఆ సందులో ఉన్న మూడిళ్ళల్లోనూ ఆ యిల్లొక్కటే హిందువులది. మిగిలిన రెండూ సాయిబులవి కావటాన అంతా ఘోషావ్యవహారం. విసుక్కుంది జయలక్ష్మి. ఉన్న యింటావిడయినా బైటికి ఊడిపడగూడదూ-తెల్లవారేసరికి ముగ్గేసి ఉన్న పక్కగడపను చూస్తూ యింట్లో యిల్లాలు లేదని ఎలా అనుకుంటుంది తను? మూడు రోజులు పంతంగా తెల్లవారే సరికి లేచింది ఆమెను చూడాలని. ప్రయోజనం లేక పోయింది. తను లేచేసరికే పక్కవారింట్లో పాచిపని అయిపోయేది....ఇలా కాదనుకుని నాలుగోనాడు మూడింటికే అలారం పెట్టుకుని లేచి వీధి గదిలో కూర్చుంది. నాలుగున్నర కల్లా ఓ ముప్ఫయి అయిదేళ్ళ వ్యక్తి లోపలి

నుంచివచ్చి యిటూ అటూ చూచి గడప ఊడ్చిచల్లి ముగ్గేసి చక్కా లోపలికి వెళ్ళి పోయింది.

జయం పొందినట్లు గర్వంతో నిట్టూర్చింది జయలక్ష్మి. "ఓ యబ్బ! ఇంతోటి సౌందర్యాని కేనా యింతటి ఘోషా!" అని నిర్లక్ష్యంగా నవ్వేసింది తెల్లారి అద్దంలో తన సోయగాన్ని చూచుకునేటప్పుడు.

కాఫీలు తాగేటప్పుడు ఇదంతా సూర్యనారా యణతో వర్ణించి చెప్పింది యింటామె వంటెత్తు తనాన్ని గురించి.

"పోనిస్తూ జయా! పల్లెటూరు-పూర్వకాలపు పద్ధతులనుకో-చదువుకున్నదానివిగదా. నువ్వు వెళ్ళి పరిచయం చేసుకోరాదూ?" అన్నాడు లోటంతా నీదేనన్నట్లు మహా. ఈ మగాళ్ళతో వచ్చిన చావేయిది! ఎప్పుడూ బైటవాళ్లనే వెన వేసుకొస్తారు.

"అదేమిటండీ? కొత్తవాళ్ళం-కొత్త చోటు! తను యింటావిడ గదా-ఆమె వచ్చి పలకరిం చాలా-తగుదునమ్మా అని ముక్కు మొహం ఎరగని ఆమెను నేను పలకరించాలా? బాగా వుంది శ్రీవారి తీర్పు" అంది చేతులు తిప్పు కుంటూ-మూతి విరుచుకుంటూ-ఇదేం విడ్డూర మమ్మా అనుకుంటూ.

అసలు జయలక్ష్మి బాధంతా వేరు. తమ బస్తీ ఫేషన్లు, అక్కడ కాలేజీ అమ్మాయిల సింగారాలు-వాళ్ళ ముందు తాను యిన్స్పిరియ ర్‌గా ఫీలయి చేసుకోటానికి వెనుకంజవేసిన సోకులన్నీ-బస్తీలో తాను కొనుక్కున్న షిఫాను చీరెలూ నలుగురి ఎదటా యీ పల్లెటూరిలో ప్రదర్శించుకుని తన ప్రత్యేకతని స్థాపించుకో వాలనీ—నలుగురు తోటి స్త్రీలకు తనో ఆరాధ్య మూర్తి అవాలనీ ఆమె తాపత్రయం. తాము హిందూ పత్రిక తెప్పిస్తామనీ తను హిందీ పరి క్షలకు వెళ్ళి రాష్ట్రభాషకూడా పేసయిందనీ తనకు ఫిడేలు వాయిద్యం బాగావచ్చనీ అంద రకూ తెలియాలని - తనను అంతా అసూయా దృష్టితో చూడాలనీ ఆమె ఉబలాటం....ఇవేవీ లేవు సరిగదా తన సుందర విగ్రహాన్ని కళ్లారా ఒక్కసారి చూచి "ఆహా! ఏమి దాంపత్యం!" అని ముచ్చటపడేవాళ్లు ఒక్కరూ కనిపించక పోగా-ప్రక్కయింట్లోనే ఉండీ ఒక్కసారి పలక రిస్తే నోటిముత్యాలు ఏమయినా రాలిపోతాయా ఆమెగారికి? ఎంతటి అహంభావం యీ మను ష్యులకి! అనుకుంది జయలక్ష్మి.

ఆమెకు పక్కయింట్లోంచి ఆట్టే సంభాషణ లయినా వినిపించేవికాదు. వాళ్లకి పిల్లలున్నారో లేదో ననుకుంది జయలక్ష్మి. ఆ సందేహం కూడా వెంటనే తీరిపోయింది (అసలు పెళ్లాం అవునో కాదో! ఒకవేళ లేవదీసుకొచ్చినబాపతు ఏమయినా కాదుగదా! అనికూడా అనుమానం కలిగింది ఆమెకు .... కానీ యీ సందేహం సూర్యనారాయణ ముందు వెల్లడించటానికి మాత్రం కాస్త సంకోచించింది.)

ఇంటాయనకు పనీపాటా ఏమీ లేదు కాబోలు ఎప్పుడూ యింట్లోనే ఉంటాడు. దొడ్లోంచి వాళ్ళింటికి వెళ్ళాలంటే గోడ అడ్డంకదా!

పసిపిల్లలతో ముద్దులాడటం మటుకు రోజూ వినిపించేది జయలక్ష్మికి పక్కవాటాలోంచి.... వీళ్ళకో పిల్లకూడా ఉన్నదన్నమాట—అను కుంది.

"ఏం బుజ్జీ—కాఫీ తాగుతావా?"

"..........."

"తాగవూ—నాతల్లే—వద్దులే."

"..........."

"ఊ—నాన్నగారు పిలుస్తున్నారా? వెళ్ళవూ? ఉహూఁ."

"..........."

"కాకేమంటుంది చిన్నా....? కా....కా అంటుందా?"

"..........."

"పిచ్చిక వచ్చిందా?....దాన్ని కొడతావా? కొట్టమ్మా?"

"..........."

"నిద్దరోస్తోందా చిట్టితల్లీ....చిచ్చి కొట్ట మంటావా? సరేలే కన్నా...." ఇలా రోజూ ముద్దుముద్దుగా పసిపిల్లలతో మాట్లాడటం విని పించేది. అయితే టెలిఫోనులో సంభాషణ లాగా ఆమె గొంతేగాని పిల్లమాటలేవీ వినిపిం చేవికావు. పోనీ ఆ పిల్లనన్నా బైకి తీసుకొస్తారా

అంటే అదీలేదు ...ఆ యింటాయన పోత రాజులా కూర్చోటమేకాని ఆ పిల్లనలా సాయం కాలం పూటైనా షికారుగా బైటికి ఎత్తుకు రాకూ డదూ? అదెంత అవ్వరసో! దాని కెక్కడ దిష్టి తగిలిపోతుందోనని లోపలే దాస్తున్నారు అని అసహ్యించుకునేది జయలక్ష్మి.

ఎలాగైనా ఏ వంకనైనా వాళ్ళింట్లోకివెళ్ళి ఆమెను ముఖాముఖి పలకరించి ఆ పిల్లను చూచిరావాలనే పట్టుదల జాస్తి అయింది జయలక్ష్మికి....కాపరానికి వచ్చి మూడేళ్లయినా ఆమె కింకా చిన్న తనపు చిలిపిచేష్టలు వదల లేదు.

♦ ♦ ♦

ఏ వంకా దొరకలేదు జయలక్ష్మికి. తన పుట్టిన రోజని వంక పెట్టి టీ పార్టీకి పిలుద్దామనుకుంది. చక్కగా ముస్తాబయి, శర్మగారు బైటికి ఎప్పుడు వెళ్తారా ఎప్పుడు లోపలికి వెళ్దామా అని కాచుకూర్చుంది. కాసేపటికి ఆయన చెంబు తీసుకుని తలుపుదగ్గరకు వేసి బైటికి నడిచి వెళ్ళాడు. లోపలనుంచి మళ్ళీ ముద్దులూ ముద్దు మాటలూ వినిపిస్తున్నాయి—ఇదే అదు ననుకుని లోపలికి గబగబావెళ్ళి ఆమె ముందు నిలబడిపోయింది—ఆ దృశ్యంచూచి నిశ్చేష్టు రాలయిపోయింది. ఈమెను చూడగానే పట్టు బడ్డ దొంగలా మాటలు ఆగిపోయి యింకా నిర్విణ్ణురాలయిపోయింది యింటావిడ.... ఎదురు గుండా ఉయ్యాల్లో బాగా ఏడేళ్ళ పిల్ల పడుకుని ఉంది.పసిపిల్లలకాళ్లుచేతుల్లాఉండి తలమటుకు ఏడెనిమిదేళ్ల పిల్లకు సరిపడా....మాగన్నుగా పడుకుని ఉంది. పిల్లమటుకు బంగారుబొమ్మలా ఉంది. నాలుగు నగలూ—బొట్టూ కాటికా—తల్లో పూలూ-అన్ని అలంకారాలూ బాగానే ఉన్నాయి. ఒక్కసారి జయలక్ష్మిని తలెత్తిచూచి నిరుత్తరురా లయిన యింటావిడ తలవంచుకునే—విపరీ తంగా పాలిపోయిన మొహంతో "ఏం పనిమీద వచ్చారమ్మా" అని అడగ్గానే "ఏమీలేదు—క్షమించం"డని తత్తరపాటుతో బైటికి వచ్చే సింది. విసురుగా యింట్లోకివెళ్ళి ఒక మూల కూర్చుని అదే పనిగా వెక్కివెక్కి ఏడ్చింది తానువడ్డ అపోహలు తలుచుకుని. ★

# సోషలిస్టు సమాజ స్థాపన : మార్గాలు

రావెళ్ల హనుమంతరావు

భారత ప్రధాన మంత్రి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూగారు మనదేశమున కొక నూతన గమ్యాన్ని సూచించారు. దానిని సోషలిష్టు సమాజస్థాపన న్నారు. ఆవడి కాంగ్రెసు మహాసభ దీనిని ఆమోదించింది. భారత పార్ల మెంటు గూడా ఆమోదించింది. సోషలిస్టు సమాజంయొక్క లక్షణాలీవిధంగా వుంటాయని వారు సూచించారు.

(1) ముఖ్యమైన ఉత్పత్తి స్థావరాలు సంఘము యొక్క యాజమాన్యములోగాని, సంఘముయొక్క అధికారంక్రిందగానిఉండాలి

(2) ఉత్పత్తిక్రమాభివృద్ధి జెందాలి.

(3) దేశంలోగల సంపదలన్నీ న్యాయాను బద్ధంగా అందరికీ పంచబడాలి.

ఈ ఆశయాలను పార్లమెంటు-అధికారంలో వున్న కాంగ్రెసు పక్షం రెండూగూడా ఏక గ్రీవంగా ఆమోదించాయి. దేశంలోగల ఆర్థిక అసమానత్వమును వైదొలగించడమే పంచవర్ష ప్రణాళికలయొక్క ముఖ్య లక్షణమని పేర్కొన డంగూడా జరిగింది.

ఆచరణలో జరుగుతూన్నదేమిటి? పై ఆశ యాలకు-నిర్వచనాలకు వ్యతిరేకంగా జరుగు తోంది. దేశంలోగల సంపదలన్నీ న్యాయాను బద్ధంగా అందరికీ పంచబడాలి. జీవిత ప్రమా ణాలను ఉన్నతం చేయాలి. అనెడి మాటలు కాగితాలమీద మాటలుగానే ఉండిపోతున్నాయి. చిలక పలుకుల్లాగ వల్లించడానికి అందంగా వుండే మాటలుగానే వుండిపోతూన్నాయి.